క్లుప్తంగా

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి



మాట్లాడుతున్న డీఐఈఓ వెంకటేశ్వరరావు

ములకలపల్లి: ఇంటర్ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) హెచ్.వెంకటేశ్వరరావు సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, ప్రగతిని పరిశీలించారు. ఈ ఆయన సందర్భంగా మాట్లాడుతూ.. షెడ్యూల్ ప్రకారం సిలబస్ సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రిన్సిపాల్ సునీత, అధ్యాపక బృందం ఉన్నారు.

ఇంధన పొదుపు వారోత్సవాలు



వ్యాసరచన, చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

దమ్మపేట: మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో తెలంగాణ పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ(టీజీఆర్ఈడీసీఓ) ఆధ్వర్యంలో ఇంధన పొదుపు వారోత్సవాలను నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా గురువారం మండలంలోని దమ్మపేట, గండుగులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సహజ ఇంధనాలను పొదుపు చేయాల్సిన అవశ్యకత, అనివార్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 'ఇంధన పొదుపు'అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా టీజీఆర్ఈడీసీఓ మేనేజర్ మహేందర్ రెడ్డి, హెచ్ఎం మస్తాన్‌వలీ, హనుమంతరావు, విజయశేఖర్ రెడ్డి, రమణాచారి, సాయిరాం పాల్గొన్నారు.

అనుమతి లేని వ్యాపార ప్రకటనల తొలగింపు

మణుగూరురూరల్: పట్టణంలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వ్యాపార ప్రకటనలను మున్సిపల్ కమిషనర్ యాదగిరి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ... మున్సిపాలిటీ పరిధిలోని పట్టణ రహదారి వెంబడి కానీ, డివైడర్ల మధ్యలో కానీ అనుమతులు లేకుండా ఎవరూ వ్యాపార ప్రకటనల బోర్డులు ఏర్పాటు చేయకూడదని సూచించారు. మున్సిపల్‌శాఖ అనుమతులు పొందిన తర్వాతనే బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. లేని పక్షంలో వాటిని తొలగించి సంబంధింత దుకాణ యజమానికి జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ స్థలాల్లో కానీ, విద్యుత్ స్తంభాలకు కానీ అమర్చినా కూడా తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి ఇటికాల భాస్కర్, సూపర్‌వైజర్ మధు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

అశ్వాపురం: కొత్తగూడెంలో జరిగిన జిల్లా స్థాయి బయాలజీ టాలెంట్ టెస్ట్‌లో ఇంగ్లిష్ మీడియం నుంచి అశ్వాపురం జెడ్పీ స్కూల్ విద్యార్థి విశాల్ 50 మార్కులకు గాను 49 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించాడు. విశాల్‌ను పాఠశాలలో గురువారం హెచ్ఎం యోగితావేణి, బయాలజీ ఉపాధ్యాయులు జ్యోతి, హనుమంతరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

మణుగూరురూరల్: ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం వారు మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలను సందర్శించి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే బస్సులు సమయానికి రాక కళాశాలలకు ఆలస్యమవుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయడంతో పాటు విద్యార్థులకు బస్సు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ నాయకులు ఎస్‌కె.వహీద్, జశ్వంత్, వినయ్‌కుమార్, కిషోర్ కుమార్, ఎస్‌కె.షాకీర్‌పాషా పాల్గొన్నారు.

లిఫ్ట్‌కు లైఫ్ ఎప్పుడు?

- రూ.9 కోట్లతో నిర్మితమైన తిమ్మంపేట లిఫ్ట్
- నాలుగేళ్లుగా నిరుపయోగంగానే ప్రాజెక్ట్
- ఎమ్మెల్యే చొరవతో ముందుకు సాగేనా?



తుమ్మలకుంట శివారులో నిర్మించిన తిమ్మంపేట ఎత్తిపోతల పథకం

ములకలపల్లి: నాలుగేళ్ల కాలంగా నిరుపయోగంగా ఉన్న తిమ్మంపేట ఎత్తిపోతల పథకం రైతులకు అందుబాటులోకి రావడంలేదు. రూ.9 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించి యేళ్లు గడుస్తున్నా, పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే జారే చొరవతో ఇటీవలే ట్రయల్ వేయడంతో అధికారిక ప్రారంభోత్సవానికి కాస్త అడుగులు పడినట్టయింది.

మూడేళ్లపాటు నిర్మాణం..

మండలపరిధిలోని తిమ్మంపేట పంచాయతీలోని తుమ్మలకుంట గ్రామశివారులో పాములేరు వాగుపై 2015–16లో రూ.8.94 కోట్ల టీఎస్‌పీ నిధులతో ఈ ఎత్తిపోతల కథకాన్ని నిర్మించారు. తెలంగాణా నీటి పారుదల అభివృద్ధి శాఖ పర్యవేక్షణలో 2020 నాటికే ప్రధాన పనులన్నీ పూర్తయ్యాయి. 884 ఎకరాల ఆయకట్టు భూమికి సాగు నీరు అందించడమే లక్ష్యంగా ఒక్కోటి 200 హెచ్‌పీ కెపాసిటీ గల రెండు మోటార్లను అమరి, వాగుకు అనుసంధానం చేశారు. పంట చేలకు పైపులైన్లు వేసి, 12 నీటితోట్లు (డీసీ) ఏర్పాటు చేశారు. ఈ తరుణంలో 2021లో స్కీంను ఇరిగేషన్ శాఖకు బదిలీ చేశారు. అటుపిమ్మల పలుమార్లు ట్రయల్‌రన్ వేసినా, అధికారికంగా రైతలుకు అందుబాగులోకి రాకపోవడంతో ఇన్నేళ్లూ నిరుపయోగంగానే ఉంది.

ఎమ్మెల్యే జారే దృష్టి సారించడంతో..

పడావుపడ్డ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక దృష్టి సారించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనికి ప్రారంభించి, రైతులకు అంకితమిచ్చేలా కృషి చేస్తున్నారు. అక్టోబర్ మాసంలో స్వయంగా లిఫ్టను సందర్శించి, వివరాలు సేకరించారు. నీటిపారుదల శాఖ అధికారులకు సూచనలు చేసి, పెండింగ్ పనులపై దృష్టి సారించేలా చేశారు. అటుపిమ్మట ఈనెల 5న తెలంగాణా రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ (టీఎస్ఐడీసీ) చైర్మన్ ముప్వా విజయబాబుతో కలసి మరోమారు పర్యటించారు. అదేరోజున ఇరిగేషన్ ఈఈ సురేశ్ చేతుల మీదుగా మెటార్లు ఆన్ చేసి, ట్రయల్ రన్ నిర్వహించారు. పుట్టతోగు గ్రామశివారులోని డిశ్చార్జ్ పాయింట్ వద్ద నీటి పరవళ్లను స్వయంగా వీక్షించిన చైర్మన్ ముప్వా, ఎమ్మెల్యే జారే సంతృప్తిని వ్యక్తం చేశారు. అతిత్వరలో మంత్రుల చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించనున్నట్లు వారు ప్రకటించారు.

రబీకి అక్కరకురాని లిఫ్ట్..

తిమ్మటకుంట శివారులోని పాములేరు వాగుపై దీనిని నిర్మించిన సంగతి తెలిసిందే. వర్షాకాల సమయంలో వాగులో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో, ఖరీఫ్ పంటకు సాగునీటికి ఢోకా ఉండదు. అయితే కేవలం ఖరీఫ్ కొసమే దీనిని నిర్మించినట్లు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కాగా వాగు నీరు ఆధారితంగా ఖరీఫ్ సాగు చేస్తున్నామని, వానాకాలంలో ఎత్తిపోతల వల్ల లాభం ఏంటన్నది ప్రధాన ప్రశ్న. నవంబర్, డిశంబర్ మాసాల్లో వాగులో నీరు చాలావరకూ తగ్గిపోతుంది. దీంతో ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక్కొక్కటి 200 హెచ్‌పీ సామర్థ్యం గల మెటార్లుకు నీరు సరిపోదు. దీంతో రబీ సాగుకు లిఫ్ట్ ద్వారా సాగేనీరు అందే అవకాశమే లేదు.

చెక్‌డ్యాం నిర్మిస్తే రబీకి నీరు..

రబీలోనూ లిఫ్ట్ ఉపయోగపడేలా వాగులో నీటి నిల్వ (వాటర్ బ్యాంకింగ్)పై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. వాగుపై చెక్‌డ్యాం వంటి వాటర్ బ్యాంకింగ్ ఏర్పాటు చేస్తేనే రబీకి సైతం నీరు అందే అవకాశం ఉంది. ఈ విషయమై అధికారులు దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. ఇటీవల పర్యటించిన విజయబాబుకు సైతం ఈవిషయాన్ని విన్నవించగా, చెక్‌డ్యాం నిర్మాణానికి హామీ ఇచ్చారు. ఇది కార్యరూపం దాల్చితేనే రబీ సాగుకు నీరు సమకూరుతుంది. అప్పడే లిఫ్ట్ ద్వారా ఆయకట్టు భూముల్లో రెండు పంటలు పండే అవకాశం ఉంటుంది.

ఇకనైనా అందుబాటులోకి తేవాలి



రూ.9 కోట్లతో కట్టి నాలుగేళ్లగా నిరుపయోగంగా ఉంటోంది. ఇకనైనా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. వాగులో నీటి నిల్వ కోసం చెక్‌డ్యాం నిర్మిస్తే రబీకి కూడా పుష్కలంగా సాగునీరు అందుతుంది.

– గౌరి నాగేశ్వరరావు, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు

మంత్రుల సమక్షంలోనే..



గౌరవ ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రిలు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా త్వరలో అధికారికంగా ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తాం. ఈ మేరకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేపట్టాం. త్వరలోనే మిగిలిన కార్యక్రమాలు పూర్తి అవుతాయి.

– వెంకటరామన్, ఏఈ నీటిపారుదల శాఖ

ఆశ్రమ పాఠశాలల్లో తనిఖీలు



ఆశ్రమ పాఠశాలలో భోజనం తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని సున్నంబట్టి గ్రామంలోగల సున్నంబట్టి, పెదవాగు ప్రాజెక్టు గిరిజన ఉన్నత ఆశ్రమ పాఠశాలల్లో గురువారం స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తనిఖీలు నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి, నాణ్యత తనిఖీ చేశారు. అలాగే పరిసరాలు, మరుగుదొడ్లను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ..పెరిగిన మెస్ చార్జీల ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, మెనూ పాటించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ సోయం ప్రసాద్‌రావు, హెచ్ఎం సుశీల, కార్యదర్శి సబితా, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ పరిధిలోని ఆర్టీసీ ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు నేడు (శుక్రవారం) డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేడు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలను 99592 25960 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బూర్గంపాడు: సారపాక విద్యుత్ సబ్ స్టేషన్‌లో కొత్త పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేందుకు శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ ఉపేందర్ తెలిపారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువజన విభాగం ఉపాధ్యక్షుడికి సన్మానం

అశ్వాపురం: కాంగ్రెస్ పార్టీ మండల యువజన విభాగం ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన భుక్యా సాయికిరణ్‌ను మండల కేంద్రంలో గురువారం డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు తుళ్లూరి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తినేని వాసు, వలబోజు మురళికృష్ణ, తాడబొయిన వెంకటేశ్వర్లు, నూకల లింగయ్య, రఘురామ్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో గురువారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక కేక్‌కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య అదనపు అధికారి ఎస్తేర్‌రాణి, జయలక్ష్మి, ప్రకాష్‌రావు, స్టాలిన్, శారారాణి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం

కరకగూడెం: కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం, ఒకే ఎన్నిక అనే నినాదంతో లేవనెత్తిన జమిలి ఎన్నికల అంశం రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని సీపీఎం మండల కన్వీనర్ కొమరం కాంతారావు గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. భారత రాజ్యాంగం సమాఖ్య వ్యవస్థను అనుసరిస్తోందని, రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తిని ఇస్తోందని పేర్కొన్నారు. జమిలి ఎన్నికలు ఈ స్ఫూర్తికి విరుద్ధమని మండిపడ్డారు. అంతేకాకుండా జమిలి ఎన్నికల వల్ల కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని కేంద్రీకరించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్ఐకు ఉత్తమ సేవా పురస్కారం

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): అన్నపురెడ్డిపల్లి ఎస్ఐ చంద్రశేఖర్‌కు ఉత్తమ సేవల పురస్కారం దక్కింది. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ చేతులమీదుగా శాఖ పరంగా ఉత్తమ సేవల అవార్డును ఎస్ఐ సీహెచ్ చంద్రశేఖర్ గురువారం అందుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో ఆయన పరిష్కరింపజేయడంలో జిల్లాలోనే మొదటిస్థానంలో నిలిచారు. ఎస్ఐతోపాటు కోర్టు కానిస్టేబుల్ కె.సురేష్‌కు పురస్కారం దక్కింది. సుమారు ఏడాదికాలంగా ఇక్కడ ఎస్ఐగా చంద్రశేఖర్ పనిచేస్తున్నారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు సీఐ ఇంద్రసేనరెడ్డి పాల్గొన్నారు.



ఎస్పీ రోహిత్‌రాజ్ నుంచి పురస్కారం అందుకుంటున్న ఎస్ఐ చంద్రశేఖర్

పేదల పక్షాన సీపీఐ పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న సారెడ్డి పుల్లారెడ్డి

బూర్గంపాడు: పేదల పక్షాన నిరంతర పోరాటాలు కొనసాగిస్తు 100వ సంవత్సరంలోకి సీపీఐ అడుగుపెడుతోందని ఆ పార్టీ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సారెడ్డి పుల్లారెడ్డి అన్నారు. సారపాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో సీపీఐ 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న తరుణంలో డిసెంబర్ 26న అన్ని గ్రామాల్లో అరుణ పతాకాన్ని ఎగురువేయాలన్నారు. ఈ నెల 28వ తేదీన మణుగూరులో జరగనున్న నియోజకవర్గ జనరల్‌బాడీ సమావేశానికి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు,అలవాల సీతారాం రెడ్డి, కామిశెట్టి రామారావు, సిద్దారపు సుబ్బారెడ్డి, ఎండి.సాజిద్, షేక్ జహుర్ పాల్గొన్నారు.

సకాలంలో జీతాలు చెల్లించాలి

మణుగూరురూరల్: సింగరేణిలో పని చేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ ఏరియా అధ్యక్షుడు వెలగపల్లి జాన్ డిమాండ్ చేశారు. యూనియన్ కార్యాలయం వద్ద గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ నెల 7వ తేదీలోగా జీతాలు ఇవ్వాలని ఎన్నిసార్లు విన్నవించినా సంబంధిత కాంట్రాక్టర్లు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కొంతమంది కాంట్రాక్టర్లకు జీతాలు అడిగితే కార్మికులను బెదిరింపులకు గురి చేస్తున్నారన్నారు. అనారోగ్యానికి గురైనా కూడా కాంట్రాక్టర్లు కార్మికులకు లీవులు కూడా ఇవ్వడం లేదని తెలిపారు. ఆయా సమస్యలపై ఏరియా యాజమాన్యం చొరవ తీసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు రాజలింగు, పి.భద్రం, పి.నారాయణ, వీర్రాజు, సతీష్, రామకృష్ణ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యూనియన్ ఏరియా అధ్యక్షుడు వెలగపల్లి జాన్

తనిఖీల పేరిట వసూళ్లు?

భద్రాచలంఅర్బన్: భద్రాచలం బ్రిడ్జి వద్ద ఉన్న జాయింట్ శాఖల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేస్తున్న సిబ్బంది పశువులు అక్రమ రవాణా చేస్తున్న పలువురి వద్ద చేతులు చాపి వదిలేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చెక్ పోస్ట్ వద్ద విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించేలా అధికారులు ఇప్పటికే చర్యలు తీసుకున్నారు. అంతక ముందు ఆగస్టు నెలలో 'సాక్షి'లో ప్రచురితం అయిన 'చెక్‌పోస్టు వద్ద అక్రమాలు'అనే కథనానికి భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ స్పందిస్తూ.. చెక్ పోస్టు వద్ద ఎన్ని వాహనాలు తనిఖీ చేశారు అనే సంఖ్యను తప్పని సరిగా నమోదు చేయాలని సూచనలు చేశారు. అందుకు గాను ఓ రిజిస్టర్‌ను ఏర్పాటు చేయించి, నిత్యం భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు సదరు రిజిస్టర్‌ను పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు.

ఈ క్రమంలో భద్రాచలం ఏఎస్పీ అంకిత్‌కుమార్ సెప్టెంబర్ నెలలో ట్రైనింగ్‌పై వెళ్లారు. తదుపరి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశాల మేరకు చెక్ పోస్టు వద్ద పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. మొదట్లో పశువులు, గంజాయి ఇతర అక్రమ రవాణాకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట పడింది. క్రమక్రమంగా చెక్ పోస్టు వద్ద ఉన్నతాధికారుల పర్యవేక్షణ తగ్గిపోవడంతో వాహనాలు తనిఖీ చేస్తున్న సిబ్బంది దీనినే అదునుగా తీసుకుని పశువులు అక్రమ రవాణా చేస్తున్న పలువురి వద్ద నుంచి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



భద్రాచలం బ్రిడ్జి పాయింట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన

అశ్వారావుపేటరూరల్: అల్పపీడనం ప్రభావంతో గడిచిన మూడు రోజులుగా వాతావరణం పూర్తిగా చల్లబడింది. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం నుంచి ఒక్కసారిగా చిరు జల్లలు పడటంతో అన్నదాతల్లో అలజడి మొదలైంది. ఈ నేపథ్యంలో పంటను కాపాడుకునేందుకు రైతులు పరుగులు పెట్టారు. అశ్వారావుపేటతోపాటు, మండల వ్యాప్తంగా చిరు జల్లలు పడటంతో ఇప్పటికే చేతికందిన ధాన్యం, వేరుశెనగ, పత్తి తడవకుండా పరదాలు కప్పారు. మరో పక్క ధాన్యం కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం రాశులు వర్షానికి తడవకుండా ఉండేందుకు పరదాలు, బరకాలు కప్పే పనుల్లో రైతులు నిమగ్నం అయ్యారు. వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్రాల్లో ఉన్న ధాన్యం రాశులను త్వరతరగతిన కొనుగోలు చేసి మిల్లులు, గోదాంలకు తరలించాలని రైతులు వినతి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో మహిళలకు గాయాలు

దమ్మపేట: రెండు వేర్వేరు ఘటనల్లో బైక్‌లు ఒకదానికొకటి ఢీకొట్టగా.. ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. ఈ ఘటనలు మండల పరిధిలోని మందలపల్లి నుంచి అల్లిపైపుకు వెళ్లు మార్గంలో గురువారం రాత్రి చోటు చేసుకున్నాయి. స్థానికుల కథనం ప్రకారం.. అశ్వారావుపేట మండలానికి చెందిన పింగళి కాంతమ్మ(40) అను మహిళ, తన కుమారుడితో కలసి సరిహద్దులోనున్న అల్లిపల్లి నుంచి బైక్‌పై మందలపల్లి వైపుకు వస్తుండగా, అదే సమయంలో సరిహద్దులోనున్న పట్టాయిగూడెం గ్రామానికి చెందిన యువకులు బైక్‌పై ఎదురుగా వస్తున్నారు. ఈ క్రమంలో మందలపల్లి శివారులో ఆ రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొట్టాయి. ఈ ప్రమాదంలో కాంతమ్మ తలకు గాయమై రక్తస్రావం కాగా.. అంబులెన్స్‌లో దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మొదటి ప్రమాదం జరిగిన స్థలానికి కూతవేటు దూరంలోనే.. అల్లిపల్లి గ్రామానికి చెందిన కేళ్ల సాంబమూర్తి, తన భార్య కనకమహాలక్ష్మితో కలసి బైక్‌పై మందలపల్లి వైపుకు వస్తుండగా.. వారిని ఏపీలోని ఏలూరు జిల్లా, లింగపాలెం మండలానికి చెందిన యువకుడు బైక్‌తో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కనకమహాలక్ష్మి కంటికి గాయమైంది. అంబులెన్స్‌లో దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రురాలిని, కుటుంబ సభ్యులు ఏలూరుకు తరలించారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

చర్ల: రబీ సీజన్‌లో రైతులకు ఎటువంటి విద్యుత్ సమస్యా ఎదురవకుండా ఉండేందుకు గానూ సత్యనారాయణపురంలోని విద్యుత్‌సబ్ స్టేషన్‌లో అదనంగా ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ ఎస్ఈ ఇ.మహేందర్ గురువారం రాత్రి ప్రారంభించారు. సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో రైతులు అధికంగా ఉండి రబీలో గణనీయంగా సాగు పెరగనున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ అదనపు 5 ఎంఈఓ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా సత్యనారాయణపురం విద్యుత్‌సబ్ స్టేషన్ పరిధిలోని గోగుబాక, జెట్టిగూడెం, తేగడ, సత్యనారాయణపురం టౌన్‌ఫీడర్లలో రైతులకు వ్యవసాయానికి ఎటువంటి అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేసేందుకు వీలుంటుంది. ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన అనంతరం ఎస్ఈ మహేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో డీఈ (ఆపరేషన్) జీవన్‌కుమార్, డీఈ (ఎంఆర్‌టీ) వెంకటేశ్వర్లు, ఏడీఈ ప్రభాకర్, రాంబాబు, వేణు, ఏఈ వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు నాయకుల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న మాలమహానాడు నాయకులు

అశ్వారావుపేటరూరల్: జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తలపెట్టిన అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో ఆ సంఘం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు.

మండలంలోని నారాయణపురం కాలనీ గ్రామానికి చెందిన మాలమహానాడు మండల అధ్యక్షుడు జక్కుల రాంబాబు, జిల్లా నాయకురాలు సాధు జోత్స్నబాయి, నాయకులు ధర్మరాజు, తూంపాటి రమేష్‌లను స్థానిక ఎస్సై టి.యయాతి రాజు ఆధ్వర్యంలో గురువారం తెల్లవారుజామున వారి ఇళ్ల వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌కు తరలించి, వ్యక్తిగత హామీపై విడుదల చేశారు. కాగా, ఈ అక్రమ అరెస్టులను ఆ సంఘం బాధ్యులంతా ఖండించారు.

జాతర మహోత్సవాలకు అంకురార్పణ

చర్ల: దుమ్ముగూడెంలో రెండేళ్లకోసారి నిర్వహించే ముత్యాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించి బుధవారం అంకురార్పణ చేశారు. 23వ జాతర మహోత్సవానికి సంబంధించి ఆలయ కమిటీ, గ్రామాలనికి చెందిన ముత్తేదువులు, పెద్దలు శుభ ముహుర్తపు రాటాను వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతీసారి జాతర ప్రాంబానికి సూచనగా ముందు ముహుర్తపు రాటను వేయడం అనవాయితీగా వస్తోంది. దీని తరువాత జాతర ప్రారంభమవుతుంది. క్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చుక్కా గణేష్‌రెడ్డి, కార్యదర్శి బైరెడ్డి సతీష్, కమిటీ సభ్యులు గణేష్, నాగేశ్వరావు, మల్లూరు, సాయి, వేణు, రవీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీసులు పునరుద్ధరించాలి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను రద్దు చేయడం వల్ల ఆర్టీసీ ఆదాయానికి గండి పడుతోందని భద్రాచలం సీపీఎం నాయకులు అన్నారు. భద్రాచలం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్తున్న సర్వీసులను రద్దు చేసిన బస్సులను వెంటనే పునరుద్ధరించాలని, భద్రాచలం డిపోలో కార్మికులపై ఆర్టీసీ డీఎం వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో ధర్నా జరుతున్న ప్రాంతానికి భద్రాచలం ఆర్టీసీ డీఎం తిరుపతిరావు చేరుకుని, డిసెంబర్ నెల చివరినాటికి రద్దు చేసిన బస్సు సర్వీసులను పునరుద్ధరిస్తామని, కార్మికుల సమస్యలపై జేఏసీ నాయకులతో చర్చిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామిలు మాట్లాడుతూ.. భద్రాచలం నుంచి బీహెచ్‌ఈఎల్, కేపీహెచ్‌బీ, చెన్నై, శ్రీశైలం తదితర ప్రాంతాలకు బస్సు సర్వీసులను రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రైవేటు ట్రావెల్స్ వైపు వెళ్లి అధిక భారాన్ని మోయవలసిన పరిస్థితి వస్తోందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుడు శరత్, వై.వెంకట రామారావు, సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు జ్యోతి, నాగరాజు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



డీఎం తిరుపతికి సమస్యలు వివరిస్తున్న సీపీఎం నాయకులు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం ఎన్. లక్ష్మయ్య - 80742 70476
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎస్. దుర్గారాంప్రసాద్ -9000327175 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

యస్.రవిబాబు - 99516 02914
ఎన్. జయరాజు - 9652868642
కె. మధు - 97059 44416